# మమకారం

చెక్కల గేటు ముందు జీప్ ఆగింది. రజనీకాంతం దిగాడు.

వైరుతో కట్టిన గేటు తీసి తన ఇంట్లోకి రాబోతుంటే వేపచెట్టు ఆకులూపి స్వాగతం చెప్పింది ఆనందంగా.

'పిచ్చి మొహమా.. నాకోసం బెంగెట్టుకున్నావా' ఆత్మీయంగా పైకి చూస్తూ అనుకున్నాడు.

20 రోజులైంది మరి.. ఆ చెట్టుకి కనిపించి! తనకే బెంగగా వుంటే ఇటూ అటూ కదలకుండా నిరీక్షించిన ఈ వేప చెట్టుకి ఇంకెంత దిగులుగా వుంటుంది. ఆ పక్క మామిడి చెట్టు కూడా బిక్క మొహం వేసుకు నించుంది. రెండు చెట్లూ ఇరవై రోజులుగా రాల్చిన కన్నీళ్లు ఎండుటాకుల్లా మారి, ముంగిలంతా నిండిపోయినట్లుంది.

కళ్లు చెమర్చాయి రజనీకాంత్‌కి స్వంత ఇంటికి వచ్చిన ఆనందంలో.

సాలిగూళ్లు తోరణాలు కట్టాయి... వీధి గుమ్మానికి.

"అయ్యగారూ..." జీపు డ్రైవరు సత్యం.. తన బేగ్ తీసుకొచ్చి పిలిచాక వాస్తవానికొచ్చాడు రజనీకాంతం!

"ఆ... నువ్వెళ్లు" అన్నాడు బేగ్ అందుకుంటూ–

"ఇల్లంతా శుభ్రం చేసి. మీరు సెటిలయ్యాక రమ్మన్నారండి.. అమ్మగారు" అన్నాడు సత్యం.

"ఆ పిల్ల చాదస్తం– ఆపాటి శుభ్రం నేను చేసుకోగలను– నువ్వెళ్లయ్యా" అంటూ ఇంటి తాళం తీయబోతుండగా చేతిలో తాళాలు లాక్కుంటున్నట్లుగా తీసుకుని తలుపులు ఓపెన్ చేసాడు సత్యం.

"ఇంక నువ్వెళ్లు.. ఇదిగో ఈ పది రూపాయలు తీసుకుని ఎక్కడైనా ఓ కూల్ డ్రింక్ తాగు"

"నేను చెప్పినట్లు మీరు వింటే... నేనీ పది రూపాయలూ తీసుకుంటానండీ" అన్నాడు సత్యం.

'మొండి సత్యం– మాట వినేరకం కాదు' అనుకున్నాడు రజనీకాంతం.

'మొండి మనిషే ఈ పెద్దాయన! అమ్మగారు చెప్పింది నిజం' అనుకున్నాడు సత్యం.

సత్యం ఇంక ఆయనతో మాట్లాడాల్సిన పనిలేనట్లుగా హడావుడిగా ఈజీ ఛైర్ దుమ్ము దులిపి ముంగిట్లో వేపచెట్టు కింద వేశాడు.

"ఒక్క పావుగంట– ఆ కుర్చీలో కూచోండి" పెద్దాయన మాటలు వినిపించుకోవడం అనవసరం అన్నట్లు గౌరవంగా ఆర్డరేశాడు.

ఏదో అనబోయేంతలో 'చీపురు ఎక్కడుంది' అనుకుంటూ లోపలికి వెళ్లాడు సత్యం.

రజనీకాంతానికి అతని చొరవ చూసి కోపం రాలేదు. తాత్వికంగా నవ్వుకుంటూ – కుర్చీలో కూలబడ్డాడు.

ముప్పై నలభై కిలోమీటర్లు జీప్‌లో కూచుని వచ్చినందుకు కాస్త వళ్లు అలిసిందనిపించినట్లు కుర్చీలో వారిగాక రజనీకాంతానికి తెల్సింది.

✦ ✦ ✦

రజనీకాంతం పంచాయితీ గుమాస్తాగా పాతికేళ్ల నుంచి ఈ పరిసరాల్లోనే పనిచేసి, పదేళ్లక్రితం రిటైరయ్యాడు. కొడుకుని శ్రద్ధగా చదివించాడు. బేంక్ పరీక్ష రాస్తూ ఆఫీసర్ రేంక్ సంపాదించాడు- చాలా తక్కువ మందికే ఆ ఛాన్స్ దొరుకుతుంది. ఆఫీసరైన పెళ్లికొడుక్కి చాలా మంచి సంబంధాలే క్యూ కట్టాయి. 'వాడిష్టం' అని రజనీకాంతం, భార్య ఎంపిక కూడా సుందరానికి వదిలేశారు. పాతికేళ్ల ముందే తాతాబామ్మా అయిపోయారు. భార్య మనవడితో కొన్నాళ్లు ఆడుకుని ఆగిపోయింది. రజనీకాంతం ఉద్యోగం హడావుడిలోపడి భార్యలేని బెంగని మర్చిపోయాడు.

ఎప్పుడైనా కొడుకుని చూడాలంటే వాళ్ళు ఉద్యోగం చేసే ఊరు వెళ్లి వస్తుంటాడు- ఓ రెండ్రోజులు అయ్యాక పెచీపెట్టి స్వంత ఇంటికి వచ్చేస్తాడు.

కొడుకూ కోడలూ- తను రిటైరైనప్పణ్నుంచీ వాళ్లతో ఉండమని పోరు ఎక్కువ చేశారు. కానీ రజనీకాంతానికి అందరు పెద్దవాళ్లలాగే స్వంత ఇంటిపై మమకారం జాస్తి-

"కాలూ చెయ్యీ స్వాధీనంలో ఉన్నన్నాళ్లూ మీరు చెప్పినమాట విననర్రా!" అని కరాఖండీగా చెప్పేశాడు- వాళ్లంటే తనకీ ఇష్టమే. కానీ ఇల్లు వదలి ఎక్కడికీ వెళ్లాలనిపించదు.

రెండు రోజులు సెలవలు దొరకగానే కొడుకూ కోడలూ మనవడితోబాటు వచ్చి ఆడది లేని ఇంటిని చక్కదిద్ది వెళ్తుంటారు పాపం! కోడలుకీ మనమడికీ రజనీకాంతం అంటే ఇష్టం గౌరవం కూడాను.

ప్రతీ నెలా వచ్చి.. వంటింట్లో డబ్బాలు నింపి... బటన్స్ ఊడిన బట్టలు తనిఖీ చేసి రిపేరు చేసి.. మొక్కలకి మందులు కొట్టించి,

కొబ్బరికాయలు దింపించి- పనిమనిషికి రహస్యంగా కొంత డబ్బు ముట్టచెప్పి మావయ్యగారికి ఏ ఇబ్బందీ రాకుండా చూస్తోండమని చెప్పి... నిలవ పచ్చళ్లు పెట్టి సీసాల్లో నింపి.. నెల్లాళ్ల పని రెండ్రోజుల్లో చేసేసి పోతుంది కోడలు బంగార్తల్లి.

ఆమె ఉన్న రెండ్రోజులూ భోజనానికి తప్ప లోపలికి రానీయదు మావగార్ని- మనవడితో కబుర్లో.... కొడుకుతో చదరంగమో ఆడుతూ కూచుంటాడు రజనీకాంతం.

వెళ్లేటప్పుడు కన్నీళ్లు పెట్టుకు పిలవడాలూ- జాగ్రత్తలు చెప్పి వెళ్లడాలూ మామూలే-

మనవడు పెద్ద చదువులు చదివాడు... ఈ జిల్లాకే కలెక్టర్ అయ్యాడు... అందరికీ వాడికన్నా ఎక్కువ ఆనందమే కలిగింది. వాడు డ్యూటీలో జాయనయ్యేముందు.. వచ్చి దణ్ణంపెడితే రజనీకాంతం ఆనందబాష్పాల్తో వాడి భుజం తడిపేశాడు- కౌగిలింతతో చొక్కా నలిపేశాడు.

"కలెక్టర్‌గారికి పెద్ద బంగళా ఇచ్చారు. మీరు అక్కడే ఉండాలింక" అంది కోడలుపిల్ల పుత్రోత్సాహం పొంగి పొరలుతుండగా.

"నా కొడుకింట్లో ఉండటానికి నాకు సిగ్గూ మొహమాటం ఉంటాయేమోగానీ... నీ కొడుకింట్లో... నాకు స్వతంత్రం ఉంటుందమ్మా. తప్పకుండా వస్తాను... వాణ్ని కాస్తంత సెటిల్ అవనీయ్" అని నచ్చచెప్పి పంపించేశాడు.

నిజంగా వెళ్లాలనే అనిపించింది.

రెండు మూడు నెలలకి 'ఫోను' పెట్టించాడు మనవడు- రోజూ ఓసారి ఫోన్ చేసి "ఎప్పుడొస్తున్నావ్ తాతా! జీపు పంపిస్తున్నా" అని సతాయిస్తున్నాడు.

రజనీకాంతానికి తను బెట్టు చేస్తున్నానని అనిపించింది.

"విదియ నాడు పంపించరా" అన్నాడు.

"సామానంతా పేక్ చేసుకొచ్చేద్దాం- నేనూ వస్తాను" అన్నాడు మనవడు.

"ఓరి పిచ్చోడా! సామాను సంగతి తర్వాత... నాకు ముందు మీ ఇల్లూ- నా గదీ నచ్చాలిగా అప్పుడే షిఫ్టింగ్" అన్నాడు రజనీకాంతం.

ఇంక ఇల్లు కదలక తప్పలేదు.

నిజంగా ఇంద్రభవనంలా ఉంది వాడికిచ్చిన బంగ్లా. మనవడితో బాటు కొడుకూ కోడలూ కూడా తను వెళ్లే టైముకి స్వాగతం చెప్తూ నిలబడ్డారు. ముగ్గురూ కాళ్లకి దణ్ణం పెట్టి ఇంట్లోకి తీసుకెళ్లారు. నాలుగు జతల బట్టల్తో... ఎయిర్ బేగ్ భుజాన వేసుకుని వచ్చిన తాతయ్యని చూసి చిన్న బుచ్చుకుంటూ....

"ఇంతేనా నీ సామాను- అంటే నువ్విక్కడుండవా?" అన్నాడు దీనంగా.

"తాతయ్యకి నచ్చి ఇక్కడే వుంటే... కొత్తబట్టలు క్షణాల్లో కొనేద్దాంరా" అన్నాడు తండ్రి.

పదిహేను రోజులు గడిపాడు- నెమ్మదిగా... 'ఇంటికెళ్తాను' అని అర్జీ పెట్టుకున్నాడు రజనీకాంతం.

"నాన్న కూడా వాలంట్రీ రిటైర్ అవడానికి ప్లాన్ చేస్తున్నారు. నువ్వు కూడా ఇక్కడే ఉండిపో తాతయ్యా" అన్నాడు బిక్కమొహం వేసి.

"వస్తాన్రా- నువ్వెప్పుడు రమ్మంటే అప్పుడొస్తాను- కానీ ఇంక నన్ను వెళ్లనియ్యరా" బేలగా అడిగాడు రజనీకాంతం.

మనవడికి అర్థమైంది. తాతగారు బోనులో కుందేలుగా వున్నారని- ఆయన స్వేచ్ఛే ఆయనకి ఆనందం- ఆరోగ్యం- ఆయుర్దాయం అని

అనిపించింది.

మళ్ళీ త్వరగా వచ్చేయమని ఒప్పించి ఒట్టు తీసుకుని పంపించారు.

✦ ✦ ✦

"అయ్యగారూ.. పది రూపాయలు ఇవ్వండి... ఇల్లంతా అద్దంలా చేశాను" అన్నాడు సత్యం.

పది రూపాయలు ఇచ్చాడు రజనీకాంతం.

జీపు దగ్గరకెళ్లిన సత్యం హాట్‌పేక్ క్యారేజీతో వెనక్కొచ్చి-

"అమ్మగారు అన్నం కట్టిచ్చారండి- రాత్రికి చపాతీలు కూడా పెట్టారంట" అన్నాడు.

రజనీకాంతానికి కళ్ల నీళ్లు తిరిగాయి.

"చాలా థేంక్స్ అని చెప్పరా" అన్నాడు.

✦ ✦ ✦

"అంత ఆత్మీయత వదలి ఎందుకొచ్చావు రజనీ" అన్నాడు చదరంగం స్నేహితుడు రంగనాథం.

"ఏమోరా నాకీ వేపచెట్టు గాలీ... మామిడి చెట్టు నీడా- మా బావినీళ్లూ.. మా ఇంటిని కనిపెట్టుకుని చూస్తున్న తులసికోటా వదలి ఉండలేననిపిస్తుందిరా... అక్కడివన్నీ ఉండవు- కొన్ని కావాలనుకుంటే ఇంకొన్ని వదులుకోవాల్సిందే కదా!" అన్నాడు గద్గదంగా.

రంగనాథం కళ్లు చెమరించాయి.

**(అంకితం: కాశీ విశ్వనాథుణ్నీ, గంగనీ వదలలేనన్న షెహనాయ్ 'రత్నా'నికి...)**